ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

కీడ్రలతో మానసిక ఉల్లాసం

బాపట్ల జిల్లా ఎస్‌పి తుషార్ దూడి



విజేతలను అభినందిస్తున్న ఎస్‌పి తుషార్ దూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని ఎస్‌పి తుషార్ దూడి తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడల్లో పతకాలు సాధించిన బాపట్ల పట్టణంలోని లిటిల్ ఏంజెల్ హైస్కూల్ విద్యార్థులను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్‌సి సోమ వారం అభినందించినారు. గత నెలలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలలో బాపట్ల లిటిల్ ఏంజెల్‌హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ విభాగానికి సంబంధించిన పోటీలు శ్రీకాకుళంలో, ఫెన్సింగ్ విభాగానికి చెందిన పోటీల్లో నంద్యాలలో నిర్వహించారు. శ్రీకాకుళంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో 10వ తరగతి విద్యార్థి వై.సతీష్ 3000 మీటర్ల విభాగంలో, 800 మీటర్ల విభాగంలో పసిడి, రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. నంద్యాలలో నిర్వహించిన ఫెన్సింగ్ పోటీలలో 9వ తరగతి విద్యార్థులు బి.ఆదిత్య సాయి, ఎస్.కిరణేశ్వర రెడ్డి రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలలో బాపట్ల పట్టణానికి చెందిన లిటిల్ ఏంజెల్ హై స్కూల్ విద్యార్థులు వివిధ విభాగాలలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. క్రీడలలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు మానసిక వికాసం పెంపొందు తుందన్నారు. సజనాత్మకతతోపాటు ఐకమత్య భావన అలవరుతుందన్నారు. విజేతలను స్ఫూర్తిగా తీసుకొని తోటి విద్యార్థులు కూడా క్రీడాపోటీలలో పాల్గొనాలని ఎస్‌పి సూచించారు. రాబోయే రోజులలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల సాధించి తల్లిదండ్రులు, విద్య బుద్ధులు బోధించిన గురువులు గర్వపడే విధంగా సత్తాచాటాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్ధారించుకొని నిర్దిష్ట ప్రణాళికతో సాధన చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్‌పి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రమేష్ కుమార్, పిఇటి గోపి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఓకే.. నిధులకేదీ దోకా..?

- ఏళ్ల తరబడి ప్రతిపాదనల్లోనే ఆశల ప్రాజెక్టులు
- పదేళ్లుగా ఊరిస్తోన్న కనిగిరి, దొనకొండ సెజ్‌లు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జిల్లా డెయిరీ, పాలపాడి ఫ్యాక్టరీ మూత
- విజన్ డాక్యుమెంట్‌లో కలెక్టర్ ప్రస్తావించిన అనేక అంశాలు ఇవే..



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

విజన్-2047 నాటికి రాష్ట్ర అభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించారు. జిల్లాల వారీగానూ విజన్ రూపొందిం చాలని సిఎం చంద్రబాబు అధికారులను కోరారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన సమావేశంలో జిల్లాల వారీగానూ అభివృద్ధికి అవకాశాలపై ప్రణాళిక రూపొం దించారు. అందులో కలెక్టర్ అన్సారియా అనేక అంశాలను ప్రస్తావించారు.ఎలా ముందుకుపోవాలో సూచించారు. ఇది మంచి పరిణామం గానే చూడాలి. పారిశ్రామికంగానూ, వ్యవసాయరంగం అనుబంధ రంగాలు, సాగునీటి వనరులను అభివృద్ధి చేసుకోవడం ద్వారా జిల్లా అభివృద్ధి చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. వాస్తవానికి ఈ అంశాలను ఎప్పటి నుంచో అన్ని రాజకీయపార్టీలు తమ ఎజండాల్లో పెట్టాయి. ఎన్నికల నినాదాలుగానూ ఉన్నాయి. జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి అనేక అంశాలు, ప్రాజెక్టులు ప్రతిపాదనల్లో ఉన్నాయి. వాటికోసం పోరాటాలు సాగాయి. నిర్దిష్ట ప్రణాళికలూ, నిధుల కేటాయింపులు లేకనే ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా సమగ్రాభివృద్ధి కోరుతూ గతంలో సిపిఎం చేపట్టన పాదయాత్ర లోనూ ఈ అంశాలన్నీ వచ్చాయి. తాజాగా జిల్లా మహాసభల్లోనూ తీర్మానాలు చేశారు. మంత్రి నారా లోకేష్ జిల్లాలో ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలోనూ ప్రస్తావనకు వచ్చాయి. వాటిపై హామీలు కూడా ఇచ్చారు. అయితే వీటన్నిటికీ నిధులదే పెద్దసవాల్. నిధుల్లేకనే ఈ ప్రాజెక్టులన్నీ కలగానే మిగిలాయి. అధికారంలో ఎవరున్నా వీటిపై నిర్లక్ష్యమే కనిపించింది. ఎన్నికల ▶ 2లో

ఆలయాల్లో చోరీలకు పాల్పడే

దొంగలు అరెస్టు

- రూ 15.50 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్‌పి దామోదర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆలయాల్లో చోరీలకు పాల్పడే నిందితులను పోలీసులు అరెస్టు చేసిన వారి వద్ద నుంచి రూ.15,5000 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి దామోదర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శ్రీకాకుళంకు చెందిన సవర సిపన్న, సవర బొగేష్, బత్తిని శ్రీకాంత్, సవర సూర్య కాకుమాని శ్రీనివాసరావు రాష్ట్రంలోని దేవాలయాలు గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తిస్తారని తెలిపారు. అనతరం పథకం ప్రకారం ఆలయాల తాళాలు పగలగొట్టి, బంగారం, వెండి వస్తువులను అపహరిస్తారని తెలిపారు. అదేవిధంగా సిసి కెమెరాలకు సంబంధించిన డివిఆర్‌లను పట్టుకెళ్తారని తెలిపారు. చోరీ చేసిన సొత్తును కాకినాడ కష్ణారావు అనే వ్యక్తికి అమ్మి వచ్చిన డబ్బులను జల్సాలకు వినియోగిస్తారన్నారు. ఈ క్రమంలో ముద్దాయిలు గూగుల్ మ్యాప్ ద్వారా ఈ ఏడాది జనరి 26న నాగులుప్పలపాడు మండలం, చదలవాడ గ్రామంలోని శ్రీ రఘునాయక స్వామి దేవాలయానికి వచ్చి తాళాలు పగలగొట్టి, వెండి బంగారు ఆభరణాలు, సిసి కెమెరాలకు చెందిన డివిఆర్‌ను తీసుకెళ్లినట్లు ఎస్‌పి తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 31న నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామంలోని శ్రీ సాయిబాబా గుడిలో వెండి వస్తువులు దొంగిలించుకుని వెళ్ళి కాకినాడ కష్ణారావుకు అమ్మి నట్లు తెలిపారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు

దేవాలయాలలో జరుగుతున్న దొంగతనాలపై ఎస్‌పి స్వీయ పర్యవేక్షణలో ఒంగోలు డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్ బాబు, సిబ్బంది, నాగులుప్పలపాడు ఎస్ఐ బి.శ్రీకాంత్, సిబ్బంది ఎస్‌వి. కిశోర్ బాబు, పి.రాఘవులు, లక్ష్మి నారాయణ, డి.తిరుపతిరెడ్డి, మణికంఠతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. కాకినాడ కష్ణారావు దొంగల వద్ద కొనుగోలు చేసిన బంగారు, వెండి ఆభరణాలు అమ్ముకొనేందుకు రైలులో చెన్నై ఎవెళుతుండగా పోలీసులు ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.15.50 లక్షల విలువైన 15 కిలోల వెండి, 4గ్రాముల బంగారు మంగళ సూత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు అభినందనలు

దేవాలయాలలో చోరీలకు పాల్పడుతున్న దొంగలను అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్న డిఎస్‌పి రాయపాటి శ్రీనివాసరావు, ఒంగోలు రూరల్ సిఐ శ్రీకాంత్ బాబు, నాగులుప్పలపాడు ఎస్ఐ బి. శ్రీకాంత్, నాగులుప్పలపాడు పిసిలు కిశోర్ బాబు, రాఘవులు, లక్ష్మి నారాయణ, తిరుపతిరెడ్డి, మణికంఠను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించి నగదు బహుమతులు అందజేశారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన

- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- జెండా ఊపి ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక విద్యుత్ భవనం వద్ద నుంచి ప్రకాశం భవనం వరకూ విద్యుత్ ఉద్యోగులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజలలో విద్యుత్ వినియోగం పై అవగాహన కల్పించే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. ఏ రంగమైనా అభివద్ధి చెందాలంటే విద్యుత్ అవసరమన్నారు. అవసరాలను దష్టిలో వుంచుకుని విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం ఇంధనాన్ని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. ప్రజలు విద్యుత్ వినియోగం పై అవగాహన పెంచుకొని ఎల్ఇడి బల్బులు, స్టార్ రేటెడ్ ఉపకరణాలు వినియోగిస్తూ విద్యుత్‌ను అదా చేయాలని సూచించారు. ఈ ర్యాలీ లో ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ శ్రీ వెంకటేశ్వర రావు, విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

వసతుల కల్పనకు నిధులివ్వండి

అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలో మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధుల మంజూరుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొల్లా మధు ఓ ప్రకటనలో కోరారు. ఒంగోలు నగరం 14 ఏళ్ల క్రితం నగర పాలక సంస్థగా ఏర్పడిందని, ప్రణాళిక ప్రకారం వేయక పోవటంతో గతంలో వేసిన సిమెంట్ రోడ్స్ 60 శాతం దెబ్బతిన్నాయన్నారు. మాస్టర్ ప్లాన్ అమలుపరచకపోవడం, రహదారికి ఇరువైపులా డ్రైనేజ్‌లు సరిపడిన కొలతలతో నిర్మాణం చేపట్టకపోవటం, మంచినీటి పైపులు రోడ్డు వేసేటపుడు కార్పొరేషన్ ఇంజిరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రణాళిక ప్రకారం వేయకపోవడంతో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. మెయిన్ పైప్ లైన్ కోసం రోడ్డు పగలకొట్టి సరిగా మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు మధ్య గ్యాప్ వచ్చి వర్షం వచ్చినపుడు ఆ గ్యాప్‌లో నీళ్లు చేరి వేసిన కాంక్రీట్ ఇసుక కొట్టుకుపోవడంతో వేసిన సిమెంట్ బిట్టు గ్యాప్ వచ్చి వాహనాలు దెబ్బతింటున్నాయన్నారు. నగరం లో వేసిన మెయిన్ రోడ్స్, కాలనీలు, వీదులలో సిమెంట్ రోడ్ల పరిస్థితి ఇలాగే ఉందన్నారు. దీంతో వాహనాలు నడిపే వారు ఇబ్బందులు పడుతున్నారని, స్పీడ్ బ్రేకర్లు ఎక్కువగా ఏర్పాటుతో వాహనాలు దెబ్బతింటున్నాయన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గుంతలు పూడ్చడం కోసం నిధులు విడుదల చేసి పనులు చేపట్టడం హర్షదాయకమన్నారు. ఒంగోలు నగరంలోని అన్ని రోడ్స్ మాస్టర్ ప్లాన్ ప్రకారం అమలుపరచి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, రోడ్స్, మంచినీటి పైపు లైన్స్, కాల్వలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని జిల్లా శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ నగరాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.



వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల

గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్స్ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సిఐటియు నాయకులతో కలిసి గురుకులాల టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీ జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ టీచర్స్‌ను కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పు చేయాలని, 2022 పిఆర్సి ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఔట్సోర్సింగ్ విధానంలో 10 నుంచి 15 యేళ్ల వరకు రాష్ట్రంలో 1656 మంది అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. బాపట్ల జిల్లాలో 45 మంది టీచర్స్ పనిచేస్తున్నారు. బాపట్ల, రేపల్లె, స్టువర్ట్ పురం, పర్చూరు, అద్దంకిలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. ఆయా గురుకులాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ స్టాఫ్‌కు టీచింగ్ స్టాఫ్ కంటే అదనంగా వేతనాలు ఇస్తున్నారని, అందువల్ల తమకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని కోరారు. గత 31 రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకులాలలో పనిచేస్తున్న టీచర్స్ సమ్మెలో ఉన్నారని వెంటనే సమ్మె పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల సిఐటియు నాయకులు కె శరత్, ఔట్సోర్సింగ్ ఉద్యమ నాయకులు ఎం పరమేష్, రామకృష్ణ, రవికిరణ్, సుజాత, శాంతిప్రియ, కోటేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ పి చౌడయ్య తెలిపారు. 565 నేషనల్ హైవేపై సోమవారం ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వెళ్లే నేషనల్ హైవేపై ముఖ్యమైన జంక్షన్లలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనాలను నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలన్నారు. అతి వేగంతో వాహనాలు నడిపి ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. అదేవిధంగా 'ఫేస్ వాష్' కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు హైవేపై వెళ్లే వాహనాలను ఆపి డ్రైవర్లకు ముఖం కడిగించి వారిని నిద్రమత్తు నుంచి లేపి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజన్ ఒకే.. నిధులకేదీ దోకా?

(మొదటిపేజీ తరువాయి)

సమయాల్లో వాటిని పూర్తిచేస్తామని ఇచ్చిన హామీలూ నెరవేరలేదు. కొత్తగా చేపట్టాల్సిన వాటికి నిధులు కేటాయింపులు లేకపోగా కొనసాగే వెలిగొండ వంటి కీలక ప్రాజెక్టులకూ ఇదే సమస్యగా మారింది. జిల్లా డెయిరీ లాంటి భారీ ప్రాజెక్టులను పాలకులే నిర్లక్ష్యం చేసి మూతపడేలా చేశారు. నిర్వహణ లోపాలతో సర్వనాశనం చేశారు. వీటిని తిరిగి పునరుద్ధరించాలంటే కోట్లాది రూపాయల నిధులు కావాలి. అందుకు రాష్ట్రం ఎంత మేరకు అండగా ఉంటుందనేదీ చూడాలి. ఎందుకంటే కలెక్టర్ ప్రస్తావించినవన్నీ ఎప్పటినుంచో చర్చలో ఉన్నాయి. కార్యరూపం దాల్చలేదు. కనిగిరి, దొనకొండ వద్ద పరిశ్రమలు పదేళ్లకు పైగానే ప్రతిపాదనల్లో ఉన్నాయి. 2014లో తెలుగుదేశం ప్రభుత్వంలోనే దొనకొండలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దాన్ని అభివృద్ధి చేయలేదు. అంతకుముందే కనిగిరిలో నిమ్జ్ మంజూరైంది. ఈ పదేళ్లలో దీన్ని పూర్తిగా వదిలేశారు. కంటితుడుపుగా కొంతభూమి సేకరించి రోడ్లు వేశారు. కలెక్టర్ ఇపుడు మళ్లీ అక్కడ పరిశ్రమలు పెడితే జరిగే అభివృద్ధి గురించి ప్రస్తావించారు. రైల్వేలైన్ల గురించి ప్రస్తావించారు.ఈ రైల్వేలైన్ల కోసం జనం పోరాడి పోరాడి విసుగెత్తి పోయారు. ఎట్టకేలకు నడికుడి–కాళహస్తి రైల్వేలైన్ పనులు కొనసాగుతున్నాయి. దొనకొండ–ఒంగోలు లైన్ విషయం గురించి జనం మరిచిపోయారు. జిల్లాకు ఆక్వా హబ్‌ను గతంలో ప్రకటించారు. అది ఇప్పటికీ అతీగతీలేదు. మూసి, పాలేరు నదుల అనుసంధానం ద్వారా ఆక్వా రంగాన్ని మరింత పటిష్టం చేయవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందు కోసం రూ.75కోట్లు అవసరమని ప్రతిపాదించారు. మూసినదికి సాగర్‌జలాలు ఇస్తే వేసవిలో మంచినీటి వనరులు అడుగంటకుండా ఉంటాని ఆప్రాంత జనం కోరుతన్నారు. ఇద కార్యరూపం దాల్చడంలేదు. జిల్లా డెయిరీని పునరుద్ధరించాలని కలెక్టర్ సూచించడం మంచి పరిణామం.దీని విషయంపై లోకేష్ పాదయాత్రలోనూ హామీ ఇచ్చారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే డెయిరీ నిర్లక్ష్యానికి గురై మూత పడింది. ఇందుకు బాధ్యత ఈ ప్రభుత్వానిదే. ఇపుడు తిరిగి పునరుద్ధరిస్తే పాలరైతులకు మేలు జరుగుతుంది. ప్రవేటు డెయిరీల దయా దాక్షిణ్యాలపై ఆధారపడకుండా ఉండొచ్చు. వ్యవసాయరంగంలో చేపట్టాల్సిన చర్యలను వెల్లడించారు. వాణిజ్య పంటలను పెంచాలని ప్రతిపాదించారు. ఇక్కడి రైతులు పత్తి, కంది, పొగాకు, శనగ పంటలను ఎక్కువగా పండిస్తారు. మార్కెటింగ్ వ్యవస్థ ప్రభుత్వ ఆధీనంలోలేనందునే ధరలు ఒడిదుడుకులుగా ఉన్నాయి. ఏ పంట బాగా పండితే దాని ధర తగ్గడం వ్యాపారుల వ్యూహంలో భాగమే. ప్రభుత్వమే పంటల మద్దతు ధరలకు సేకరిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. సుబాబుల్ కొనుగోళ్ల ఒప్పందం అమలు కావడం లేదు. పంటలు బాగానే పండుతున్నా ధరలే ప్రశ్నార్థకంగా మారాయి. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసుకోవడం ద్వారా తాగునీరు, సాగునీటి రంగాల్లో ముందుకు పోవచ్చని కలెక్టర్ సూచించారు.మంచి అంశమే. వెలిగొండ ప్రాజెక్టు కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఎప్పటి నుంచో దీనికోసం రైతులు ఆశలు పెట్టుకున్నారు. పదేళ్ల నుంచి దీనిపై నిర్లక్ష్యమే సాగుతోంది. దీన్ని పూర్తిచేయడంలో నిధులు వైఫల్యమే కొనసాగుతోంది. ఇప్పటికీ నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. గ్రామాలు ఖాళీ చేయాలి. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తామని మంత్రులు ప్రకటించారు. వాస్తవానికి అంత కాలం కూడా అవసరం లేదు. తక్షణం రూ.2వేల కోట్లు కేటాయించాలి. అందుకే దీన్ని ముందుకు సాగదీస్తున్నారు.నిధులిస్తే వారం రోజుల్లో గ్రామాలు ఖాళీ చేస్తారు. పునరావాసం కల్పిస్తే వెళ్లడానికి నిర్వాసితులు సిద్ధంగానే ఉన్నారు. మార్కాపురం జిల్లా వ్యవహారం పెండింగ్‌లోనే ఉంది. దీనివల్ల పాలనా సౌలభ్యం తోపాటు పశ్చిమప్రాంతం అభివృద్ధికి దోహద పడుతుంది. విద్య,వైద్య రంగాలు, రియల్ ఎస్టేట్‌పై కలెక్టర్ దృష్టిసారించి అభివృద్ధికి అవకాశాలను పరిశీలించారు. గ్రానైట్ ఎగుమతుల కన్నా వాటిని ఇక్కడ అభివృద్ధి చేస్తే ఇంకా రాబడి పెరిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వం నుంచి ఈ రంగానికి ప్రోత్సాహం లేదు. ఈ రంగం ఎవరు అధికారంలో వుంటే వాళ్లచేతుల్లో ఉంటుంది. పాలకపార్టీల నేతలకు ఆదాయ వనరుగా మారింది. ఏదేమైనా ఈరంగాల్లో ఆశించిన అభివృద్ధి జరగాలంటే నిధులు కేటాయించాలి. నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి.అపుడే సమగ్రాభివృద్ధి సాధ్యం.

రేపు మండల సమావేశం

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్దదోర్నాల ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 18వ తేదీన మండల సాధారణ సమావేశం ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాసరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు.

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

రూ.6,67,000 సొత్తును స్వాధీనం

వివరాలు వెల్లడించిన సిఐ ప్రభాకరరావు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వేర్వేరు చోరీ కేసుల్లో నిందితులను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.6,67,000 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు యర్రగొండపాలెం సిఐ సిహెచ్.ప్రభాకరరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను సిఐ వెల్లడించారు. యర్రగొండపాలెం మండలం గుర్రపుశాల గ్రామానికి చెందిన బడిపాటి ఏసేబు, మరికొంతమంది కూలి పనుల నిమిత్తం ఇళ్లకు తాళాలు వేసి కొండపి, హైదరాబాదు, నాగర్ కర్నూల్ తదితర ప్రాంతాలకు వెళ్లారన్నారు. వారి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించి బాధితులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఏసేబు వ్యక్తి వచ్చి చూడగా అతని ఇంటితో పాటు మొత్తం 12 గృహాల్లో చోరీ జరిగినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఏసేబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. యర్రగొండపాలెం ఎస్ఐ పి.చౌడయ్య, పోలీస్ సిబ్బంది కేసు దర్యాప్తును ప్రారంభించినట్లు తెలిపారు. కొలుకుల గ్రామానికి చెందిన ముండ్ల రామయ్య ఈ చోరీలకు పాల్పడినట్లుగా పోలీసు సిబ్బంది గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు రామయ్యను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.6,67,000 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. నిందితుడిని మార్కాపురం కోర్టులో హాజరు పరచినట్లు ఆయన తెలిపారు.

సోలార్ బ్యాటరీలు చోరీ చేసిన ఇద్దరు అరెస్టు

సోలార్ బ్యాటరీలను చోరీ చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సిఐ ప్రభాకర్‌రావు తెలిపారు. గత నెల 11 పాలుట్ల, పొన్నలబైలు గ్రామాలలో సోలార్ బ్యాటరీలు చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ ఘటనపై విద్యుత్ ఎఇ అల్లూరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా యర్రగొండపాలెం ఎస్ఐ పి.చౌడయ్య, వారి సిబ్బంది వివిధ కోణాల్లో విచారించి కొప్పాక ప్రసన్న కుమార్, పిండి రామకృష్ణను నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం మార్కాపురం కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ పి.చౌడయ్య, ఎఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ ప్రభాకరరావు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి స్వామి

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు మండలంలోని చెరుకూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ ఆరికట్ల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని మంత్రి స్వామి పరామర్శించారు. చవటపాలెం గ్రామానికి చెందిన పాతూరు మాల కొండయ్య కుటుంబాన్ని కూడా సోమవారం మంత్రి స్వామి పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు అనమోలు సాంబశివ రావు, పొన్నలూరు గ్రామ నీటి సంఘం అధ్యక్షులు మండవ ప్రసాద్, ఉపాధ్యక్షులు దానికొండ మహేంద్ర, మండల సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి, పిల్లి వెంకటనారాయణ రెడ్డి, మండల యువ నాయకులు దాసరి కృష్ణారావు, ఎర్ర నరేంద్ర పాల్గొన్నారు.

ప్రమాదాల 'జంక్షన్'

- అడ్డరోడ్డులో అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ జంక్షన్ నిత్యం గుంటూరు– కర్నూలు, చెన్నై–హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉంటుంది. జంక్షన్ మధ్యలో స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు విగ్రహం ఉంది. దాని ఆనుకొని రోడ్డుకి ఇరువైపులా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ ఫ్లెక్సీల వల్ల అటుగా వచ్చే వాహనాలు కనబడటం లేదని ఆయా వాహనాల డ్రైవర్లు వాపోతున్నారు. అంతేకాకుండా జంక్షన్‌లో వాహనాల రాకపోకలకు తగ్గట్టుగా విస్తీర్ణం లేదు. దీంతో జంక్షన్‌లో యూటర్న్ తీసుకునే వాహనాలకు, అటు వైపుగా వెళ్లే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం, సంతగుడిపాడు ఎస్సీ కాలనీకి చెందిన పచ్చాకు కార్మికులు గిద్దలూరులో కూలీ పనుల నిమిత్తం లారీ ఎక్కి ఈ జంక్షన్ గుండా వినుకొండ వైపు వెళుతూ యూటర్న్ తీసుకునే క్రమంలో నెల్లూరు నుంచి మిర్యాలగూడ వైపు వెలుతున్న కంటైనర్ లారీ ఢీకొంది. దీంతో నలుగురికి గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. ఈ జంక్షన్‌లో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, రహదారులకు ఆనుకొని ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన అడ్డరోడ్డు జంక్షన్

ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి

పశువుల కాపరి మృతి

ప్రజాశక్తి-బల్లికురవ



మృతి చెందిన పిచ్చయ్య

ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి పశువుల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని వల్లాపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన పాస్టర్ రోశయ్య కుమారుడు పిచ్చయ్య (30) మానసిక వికలాంగుడు. ప్రతిరోజు పశువులను తోలుకొని పొలం వెళుతుంటాడు. ఈ క్రమంలో ప్రక్కనే ఉన్న చాకలికుంటలోకి పశువులు దిగడంతో వాటిని బయటకు తోలేందుకు దిగి కాలు జారడంతో పడిపోయి మృతి చెందాడు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు

గ్రానైట్ లారీలు పట్టివేత

ప్రజాశక్తి-బల్లికురవ

అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ లారీలను విజిలెన్స్ ఏడీ రామచంద్ర ఆధ్వర్యంలో ఆర్ఐ రాజు బృందం వల పన్ని పట్టుకున్నారు. అందులో నాలుగు లారీలను బల్లికురవ పోలీస్ స్టేషన్‌కు తరలించి స్టేషన్ హౌస్ ఆఫీసర్ జీవి చౌదరికి అప్పగించారు. రెండు లారీలను సంతమాగులూరి పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడ స్టేషన్‌లో అప్పగించారు. లారీలలో ఉన్న సరుకు లెక్క కట్టి పెనాల్టీలు విధించనున్నట్లు ఏడీ రామచంద్ర తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-పెద్దారవీడు

కలనూతల గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో నాటు సారాయి తయారు చేస్తున్నారన్న విశ్వసినీయ సమాచారం మేరకు పెద్దారవీడు ఎస్ఐ పి.అనిల్‌కుమార్, తన సిబ్బంది మరియు ఎస్‌బి ఎఎస్ఐ మాల్యాద్రితో కలిసి కలనూతల గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో నాటు సారాయికి ఉపయోగించే సుమారు 600 లీటర్లు బెల్లం ఊటను సోమవారం ధ్వంసం చేశారు. గతంలో కూడా రెండుసార్లు 800 లీటర్ల నాటు సారాయి ఊటను ధ్వంసం చేశారు. ఇప్పటి వరకు మొత్తముగా 1400 లీటర్లు నాటు సారాయి ఊటను ధ్వంసం చేసిన పెద్దారవీడు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలను పూర్తిగా నిర్మూలిస్తామని, ఇంకా ఎక్కువగా నిఘా పెట్టి, తయారీదారులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మట్టి తవ్వకం అడ్డగింత

ప్రజాశక్తి-అద్దంకి

మండల పరిధిలోని తిమ్మాయపాలెం సమీపంలోని జమ్ములకుంటలో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను టీడీపీ నాయకులు పరిటాల శ్రీనివాసరావు అడ్డుకున్నారు. ఎక్కడో కాంట్రాక్టు పనులు చేసుకోవడానికి వచ్చి తిమ్మాయపాలెం సమీపంలోని మట్టి తవ్వకాలు జరపడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నించారు. మైనింగ్ అధికారులు ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి అక్రమంగా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లో ఆరోగ్య భారతి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ ఆపత్కాల సమయంలో ఎదుట వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు అతనిని సిపిఆర్ ద్వారా ఆక్సిజన్ అందించి రక్షించే విధంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే విద్యార్థులకు ఆరోగ్యకరమైన అలవాట్లు మీద అవగాహన కల్పించారు. వ్యక్తి స్పృహ కోల్పోయినప్పుడు అందరు గుమి కూడటం అనేది మంచిది కాదన్నారు. వారికి గాలి తగిలే విధమైన జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత పది నిమిషాల్లోపు మనం సీపీఆర్ చేస్తే వారికి రక్తప్రసరణ మెదడు దాకా చేరి మరలా జీవించే అవకాశాలు లేకపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వంగర శేషగిరిరావు, మాచర్ల వెంకటేశ్వర్లు, పాఠశాల కరెస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు తదితరులున్నారు.



సిపిఆర్ చేసి చూపిస్తున్న డాక్టర్ విష్ణు ప్రసాద్

షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నిచర్ దగ్ధం

ప్రజాశక్తి-బల్లికురవ

మండలంలోని వల్లాపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. హెచ్‌ఎం గదిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో కంప్యూటర్లు, ఫ్యాన్లు ఇతర ఫర్నిచర్ కాలిపోయాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల అభివృద్ధి నిధులతో వీటిని కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి -మేదరమెట్ల

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ఈ మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కూటమి ప్రభుత్వాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రం డిమాండ్ చేసారు. సోమవారం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల అంబేద్కర్ విగ్రహం వద్ద నీలం నాగేంద్ర విలేకర్లుతో మాట్లాడారు. బీసీలకు కూటమి ప్రభుత్వం ఒక కోటి 30 లక్షల మందికి సబ్సిడీ రుణాల కోసం కోసం 1878 కోట్లు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కూడా సబ్సిడీ రుణాలు విడుదల చేయాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రణాళిక

ప్రజాశక్తి-వేటపాలెం

పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించినట్లు చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజనల్ పరిధిలో ఉన్న పోలీస్ అధికారులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు కేసులలో పురోగతి సాధించేందుకు సిబ్బంది నైపుణ్యం పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. కేసుల పురోగతి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇసుక అక్రమాలను అరికట్టేందుకు రెవెన్యూ, మైనింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటామన్నారు. వేటపాలెంలో మూడేళ్ల క్రితం వెలుగు చూసిన కోపరేటివ్ సొసైటీ ఆర్థిక నేరంలో నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు ఉంటాయన్నారు. తీర ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిస్సింగ్, యాక్సిడెంట్ కేసులకు సంబంధించి పూర్వపరాలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర న్యాయానికి కృషి చేస్తామన్నారు. అపరిష్కృత కేసుల విషయంలో పూర్తి సమాచారంతో ముందుకెళ్తామన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని కావూరు వినయాశ్రమం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి యువ నాయకులు కొనకాల రవి కరణ్ గౌడ్ ఆర్థిక సాయం అందజేశారు. బాలికల గురుకుల పాఠశాలలో మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రవి కిరణ్ గౌడ్ స్పందించి నగదు సహాయం అందజేశారు. టీడీపీ నాయకులు ఎంఆర్‌కె మూర్తి ఈ నగదును ప్రిన్సిపాల్‌కు అందజేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మండవ తాతాజీ, మల్లాది రామకృష్ణ. సర్పంచి చెల్లి జ్యోతి రవికుమార్, సుఖవాసి వాసదేవ వరప్రసాద్ రావు, పాల్గొన్నారు. దాత రవి కిరణ్ గౌడ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



రూపొందించిన ప్రాజెక్టుతో విద్యార్థులు

పాలిటెక్నిక్ స్టేట్ లెవల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోకు వేటపాలెం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సేయింట్ ఆన్స్ కాలేజ్ అఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ఫెస్ట్‌కు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తముగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఒంగోలులోని డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్‌లో కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు రూపొందించిన ఆటోమేటిక్ స్టెర్‌కేస్ లైట్ కంట్రోల్ యూజింగ్ ఆర్డినో ప్రాజెక్టుకు మొదటి బహుమతి వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.జగదీష్ బాబు తెలిపారు. ఈ రీజనల్ పాలిటెక్నిక్ ఫెస్ట్ నందు 11 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు పాల్గొని 56 ప్రాజెక్టులు ప్రదర్శించారు. కళాశాల నుంచి 11 ప్రాజెక్టులను ప్రదర్శించగా అందులో ఈ ప్రాజెక్టు మొదటి స్థానం సాధించి రూ.25 వేలు నగదు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టును పాలిటెక్నిక్ 2వ సంవత్సరం చదువుతున ఈసీఈ బ్రాంచి విద్యార్థులు వికాస్, ఎ.చంద్ర మణికంఠ, వై.గౌరిశివ సాయి ప్రసాద్, ఎస్.లోకేష్‌లు కళాశాల అధ్యాపకురాలు సి.హెచ్ భానుశ్రీ పర్యవేక్షణలో రూపొందిచారని పాలిటెక్నిక్ డెప్యూటి డైరక్టర్ కె.విజయభాస్కర రెడ్డి తెలిపారు. జనవరి 6, 7, 8 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న స్టేట్ పాలిటెక్నిక్ ఫెస్ట్‌లో ఈ ప్రాజెక్టును ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో పాటు వివిధ బ్రాంచీలలో 5 ప్రాజెక్టులు ప్రదర్శనకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను వివిధ విభాగాధిపతులు, ఆధ్యాపకులు అభినందించి రాష్ట్ర స్థాయిలో మరిన్ని బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు.



ప్రీమియర్ లీగ్‌లో గెలుపొందిన క్రికెట్ జట్టు

ప్రీమియర్ లీగ్ విజేత శివాజీ నగర్

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రకాశం జిల్లా జోన్ లెవెల్ భాష్యం ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలలో శివాజీ నగర్ బ్రాంచ్ జట్టు విజేతగా నిలిచింది. గత రెండు రోజులుగా స్థానిక భాష్యం స్కూల్లో జరుగుతున్న పోటీలలో 10 జట్లు పాల్గొన్నాయి. శివాజీ నగర్ బ్రాంచ్ జట్టు, టంగుటూరు బ్రాంచ్ జట్టు ఫైనల్ చేరగా ఫైనల్లో శివాజీ నగర్ జట్టు విజేతగా నిలిచింది. పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్ర మం లో చీమకుర్తి సీఐ ఎం సుబ్బారావు, భాష్యం జోన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకృష్ణ గణేష్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

అశోక్ బాబు అభినందనలు

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్ బాబును గుంటూరులో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ మనవడు యశ్వంత్ రావు అంబేద్కర్ అభినందించారు. ఈ సంద ర్భంగా యశ్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ జాతి ప్రయోజనాల కోసం ఎంతో కష్టపడి పని చేస్తున్న అశోక్‌బాబు అభినందనీయుడన్నారు. అంబేద్కర్ మనవడు అశోక్ బాబుని అభినందించడం పట్ల దళిత ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.



యశ్వంత్ అంబేద్కర్‌తో అశోక్‌బాబు

రైతులను ఆదుకోవాలి

'అన్నదాత సుఖీభవ' వెంటనే అమలు చేయాలి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద రైతు సంఘం నాయకుల ధర్నా

ప్రజాశక్తి-ఇంకొల్లు

అన్నదాత సుఖీభవ సొమ్ములు రైతుల ఖాతాలలో వేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాపట్ల జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కందిమల్ల రామ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఇంకొల్లు మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల సిఐటియు డివిజన్ కార్యదర్శి నలతోటి బాబురావు పాల్గొనారు. రైతు సమస్యలు పరిష్కరించాలని, సమస్యలతో కూడిన నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ వెంకటరత్నంకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గత ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ సొమ్ములు వెంటనే జమ చేయాలని అన్నారు. కౌలు రైతులందరికీ భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేసి, వస్తున్న విద్యుత్ అదనపు బిల్లులను తగ్గించేందుకు, సర్దుబాటు చార్జీలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకే యూరియాతో పాటు వివిధ ఎరువులు అందుబాటులోకి వచ్చేటట్టు ప్రభుత్వం అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్ వెంకటరత్నం మాట్లాడుతూ సమస్యలన్నీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాదాల అంజయ్య, అన్యం ఆదీయ, మాదాల అంజయ్య, కౌలు రైతు సంఘం నాయకులు ఎన్.భాను ప్రకాష్, బాచిన హనుమంతరావు, సంజీవరెడ్డి, ఇంటూరు సుబ్బారావు, ముప్పరాజు శ్రీను, కొల్లూరు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంగులూరు తహశీల్దార్ పి.సింగారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాల నుంచి అభివృద్ధి చెందాల్సిన వ్యవసాయం కుంటు పడిందని, వ్యవసాయ ఉపకరణాలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగటమే కాక, కల్తీలు కూడా పెరిగాయని రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. పకృతి వైపరీత్యాలైన అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షం, చీడపీడల వల్ల రైతాంగానికి అపారమైన నష్టం జరుగుతుందని అన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం నష్టాలకు రైతు బాధ్యుడు కాదని, అయినా నష్టాలను రైతులే భరించాల్సి వస్తుందని అన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు మాట్లాడుతూ రైతును ఆదుకోవాల్సిన ప్రభుత్వం కావాలని వ్యవసాయాన్ని నష్టాలు పాలు చేసి, వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం పథకం ప్రకారం వ్యవసాయ రంగాన్ని దివాలా తీయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తలపనేని సుబ్బారావు, తానికొండ సుధాకర్‌రావు, రావూరి వెంకటేశ్వర్లు, నందవరపు జాన్ సాహెబ్, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు: పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతూ రైతు సంఘ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు నాయకులు భక్తులు హనుమంతరావు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 1బితో సంబంధం లేకుండా రైతులు రైతులుకు పంట రుణాలు ఇవ్వాలని గ్రామసభలలో రైతులు తెలిపిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ తహశీల్దార్ టి.ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్ష, కా ర్యదర్శులు పి.నాగేశ్వరరావు, వి.కృష్ణమూర్తి, వై.రాంబాబు, మోహనరావు, బి.సూరిబాబు, డి.సదాశివరావు, నాగేశ్వర రావు, వీరాజు, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మార్టూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు



ఇంకొల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు



పంగులూరులో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన

ప్రజాశక్తి-మేదరమెట్ల

ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా మంగళవారం మేదరమెట్ల సెంటర్‌లో సిపిఎం నేతలు కరెంట్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఆంజనేయులు మాట్లాడు తూ అదానీ కుంభకోణాలకు ఫలితమే ఈ కరెంటు చార్జీల పెంపు అన్నారు. రాష్ట్రంలో అధికారపక్షం కానీ విపక్షంగానే అదానీ చేసిన కుంభకోణాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలు మోదీకి అనుకూలమే అన్నారు. వామపక్షాలమైన మేము చేసే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు కలిసి పనిచేసి ఈ కరెంటు భారాన్ని తగ్గించుకోవడానికి మీ వంతు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై.రవీంద్రబాబు, ఎం.సత్యమూర్తి, డి.జయమ్మ, ఎం.వైకుంఠం సేవ కోటేశ్వరరావు, బి.విజయకుమార్, యోహాన్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



కరెంటు బిల్లులు దహనం చేస్తున్న సిపిఎం నేతలు

బాలికలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-బల్లికురవ

బాలికలను సంరక్షించుకోవాలని సీడీపీవో సుధా అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కిషోర బాలికల హక్కులు, బాధ్యతలను, మహిళా పోలీస్ అధికారులు కాపాడాలన్నారు. కిషోర్ బాలికల జీవన వికాసం కోసం సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల ముందుకు రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ రమీజ్ కేజీబీవీ యోగ టీచర్ స్వర్ణలత, ఎం.వి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహర రెడ్డి, మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని వివిధ ఆలయాలలో ధనుర్మాస కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక హరిహర క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సందర్భంగా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమాల వివరాలను ఆమె వివరించారు. మండలంలోని కె.అగ్రహారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస కార్యక్రమాలను కృష్ణ సాయి గ్రానైట్స్ అధినేత శిద్దా భరత్ ప్రవళిక దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గత 23 ఏళ్లుగా ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయ అభివృద్ధికి కృష్ణసాయి గ్రానైట్స్ విశేష కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాండూరి రవి రామానుజాచార్యులు, వెంకట రామాచార్యులు, పంచాంగం రామానుజాచార్యులు, కోట బాల కృష్ణ, గుర్రం దామోదర్ రావు, గుర్రం హరి పాల్గొన్నారు.



పూజలు ప్రారంభిస్తున్న దృశ్యం

రైతు సంక్షేమానికే సాగునీటి సంఘాలు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రైతుల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించిందని, రైతాంగానికి సేవ చేయాలనే దృఢ సంకల్పం ఉన్న నాయకులను ఎన్నికల్లో ఎన్నుకున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో సాగునీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ కోణంలో కాకుండా పార్టీకి పని చేసే వారి కోసం నామినేటెడ్ పదవిలా కాకుండా రైతు ప్రయోజనాల కోసం రైతుల పట్ల నిబద్ధత, రైతుల కోసం పనిచేయాలని తపన ఉన్న వారిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎమ్మెల్యే ఏలూరి అభినందించారు. పలువురు నాయకులు ఎమ్మెల్యే ఏలూరిని పూలమాల శాలువాలతో సత్కరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి 5
మంగళవారం 17 డిసెంబర్ 2024

కల్తీ ఆహారంపై కంట్రోల్ ఏదీ..?

- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు
- హోటళ్లలో కానరాని పరిశుభ్రత
- పట్టించుకొని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కొందరు వ్యాపారులు అధికారుల నిర్లక్ష్యం, ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కల్తీ ఆహారాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారులకు డబ్బు సంపాదనే ప్రధానం. ప్రభుత్వ నిబంధనలు. వారికి పట్టవు. తెలిసినా పట్టించుకోరు. ఇలా చేయడం తప్పు అని చెప్పాల్సిన అధికారులు నాలుగు డబ్బులు చేతిలో పడేసరికి చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రజారోగ్యం గుల్ల అవుతోంది. అధికారులు మామూళ్ల మత్తుతో జోగుతూ ప్రజారోగ్యం గురించి పట్టించుకోవడం లేదని ఆపరోణలు వినిపిస్తున్నాయి. రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, హోటళ్ల ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. లైసెన్స్ లేకపోతే తనిఖీల్లో దొరికినప్పుడు సెక్షన్ 63 ప్రకారం ఫుడ్ సేఫ్టీ కమిషన్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే 6 నెలల జైలు శిక్షతో పాటు రూ. 5 లక్షల జరిమానా విధిస్తారు. ఆహార పదార్థాల తయారీకి టెస్టింగ్ సాల్ట్ (చైనా సాల్ట్)ను వినియోగించ కూడదు. రోజువారీగా వినియోగించేఉప్పునే ఉపయోగించాలన్నారు. ఈ నిబంధనలను హోటల్లో, రెస్టారెంట్లు, యాజమాన్యాలు పాటించడం లేదు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. వంట వండే వ్యక్తి వడ్డించే వ్యక్తులకు సంబంధిత హోటల్ యజమాని డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది పట్టణంలో చాలా చోట్ల అమలు కావడం లేదని ప్రజలు చెబుతున్నారు.

పరిశుభ్రత ఏదీ..

పెద్ద హోటళ్లు, కొన్ని రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిగిలిన ఆహార పదార్థాలను. ఫ్రిజ్లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తున్నారు. మాంసం సైతం ఇదే విధంగా ఫ్రిజ్లో ఉంచి వండుతున్నారు. యర్రగొండపాలెం, పెద్దారవీడు మండలంలోని కుంటలోని నాన్‌వెజ్ హోటళ్లలో కుళ్లిన మాంసంతో తయారు చేసిన బిర్యాణి విక్రయిస్తున్నట్లు పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. మిగిలిన మటన్, చికెన్ ఆహార పదార్థాలు, బిర్యానిని ఫ్రిజ్లో భద్రపర్చి మరుసటి రోజు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నాన్‌వెజ్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, సానిటైజ్ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో నాన్‌వెజ్ హోటళ్ల నిర్వాహకుల తీరు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. రకరకాల పేరిట బిర్యాని, చికెన్, మటన్ హోటళ్లు, ఫుడ్ కోర్టులు జోరుగా వెలుస్తున్నాయి. కల్తీ నూనె, కల్తీ మాంసం, కల్తీ ఆహార పదార్థాలతో మటన్, చికెన్ బిర్యాని తయారు చేసి విక్రయిస్తునఆనరు.పలు హోటళ్లలో



ఈ తతంగం కొనసాగుతున్నప్పటికీ ఏనాడు అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఫుట్ సేఫ్టీ అధికారులు సైతం తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ఫోన్ ద్వారా ఆర్డర్ చేసే బిర్యాని, మటన్, చికెన్ పార్సిళ్లు ఇంటికే చేరవేస్తున్నారు. చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాలు, చాట్, నూడుల్స్ షాపులు అన్ని కలుపుకుని యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్ద దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో కలిపి వందకు పైగా ఉన్నాయి. వీటితో ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. అధిక శాతం మురుగునీటి కాలువలు, చెత్త కుప్పల పక్కనే వీటిని నిర్వహిస్తున్నా అడిగే నాథుడు కరువయ్యారు.



కల్తీ పదార్థాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి

షేక్ చిన్నవలి, యర్రగొండపాలెం



కల్తీ ఆహార పదార్దాలు విచ్చల విడిగా విక్రయాలు జరుపుతున్నారు. అధికారులు ఈ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో కల్తీరాయుళ్లు విచ్చల విడిగా విక్రయాలు జరుపుతున్నారు. ఉన్నతాధికారులు దాడులు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

ఆహారం కల్తీతో అనారోగ్యం

పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాలపొడర్లు, యూరియా, పిండి, నూనె, నీళ్ల కలిపి విక్రయిస్తున్నారు. ఇనుప రజను, రంపపు పొట్టును టీ పొడిలో కలపడంతో ఊపిరితిత్తులు దెబ్బతినే ప్రమాదం ఉంది. జంతువుల కళేబరాల నుంచి సేకరించిన ఎముకలను బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి తీసిన ద్రావణాన్ని వంట నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీంతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆరోగ్యకరమైన జంతు మాంసాన్ని 24 గంటల్లోపే వినియోగించాలి. చాలా హోటళ్లలో చనిపోయిన జంతువుల మాంసాన్ని, ఎక్కువ కాలం నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నారు. చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్లలో కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఎక్కువగా హానికర రంగులు వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి రోగాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కల్తీ ఆహారంతో వ్యాధులు

డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రభుత్వ వైద్యులు, యర్రగొండపాలెం



పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే కేన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలోనూ వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీంతో కేన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదముంది. షుగర్ లెస్ స్వీట్లలో అధికంగా సాక్రిస్ వినియోగిస్తున్నారు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. అన్ని రకాల పండ్లను ఆకర్షణీయంగా కనిపించేందుకు కార్బైడ్తో హానికారక రంగులు, జిగురు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. దీంతో కాలేయ సమస్యలు, కడుపునొప్పి, నిద్రలేమి, కిడ్నీ సమస్యలు వస్తున్నాయి.

అధికారులు తనిఖీలు నిర్వహించాలి

ఎం ఎలీషా, యర్రగొండపాలెం




యర్రగొండపాలెం ప్రాంతంలో నాసిరకం వస్తువులతో చిరుతిండ్లు తయారు చేస్తున్నారు. కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. రుచికరంగా రంగురంగుల్లో ఉండడంతో ప్రజలు వాటికి ఆకర్షితులై కొని తిని వ్యాధుల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల తనిఖీలు నామమాత్రమే. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు తనిఖీలు నిర్వహించాలి. కల్తీ ఆహారాన్ని అరికట్టాలి.

ఆధునిక వైద్యంతో మగవారికీ అందం

డాక్టర్ ఎందేటి సునీల్ కిశోర్, ఉషా సూపర్ సెష్పాలటీ హాస్పిటల్, ఒంగోలు

ప్రజాశక్తి- ఒంగోలు

నేటి ప్రపంచంలో ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని, దీని ద్వారా మగవారు కూడా అందంగా కనిపించవచ్చునని ఉషా సూపర్ సెష్పాలటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎందేటి సునీల్‌కిశోర్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి క్లీనజర్‌తో శుభ్రం చేయుట వల్ల మృత కణాలు మరియు నలుపు తగ్గుతుందని తెలిపారు. మగవారి శర్మ సౌందర్యం కోసం తమ వైద్యశాలలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్ సునీల్ కిశోర్ తెలిపారు. ఎస్‌పిఎఫ్ 50 పైన ఉండే సన్‌స్క్రీన్ చర్మాన్ని శక్తివంతమైన యువి రేస్ నుంచి కాపాడుతుందని తెలిపారు. చర్మాన్ని రక్షించుకోవడానికి ముఖం మీద, మరియు బయటకు ఎక్స్‌పోజు అయ్యే ప్రాంతాల్లో సన్‌స్క్రీన్ 2 లేదా 3 గంటలకు ఒక్కసారి అప్లై చేయాలన్నారు. మాయిశ్చరైజర్ క్రీం పూయటం వల్ల శరీరంలోని తేమ శాతం నియంత్రించ బడుతుందని తెలిపారు. శరీరంలో పగుళ్లురావని పేర్కొన్నారు. హైడ్రా ఫేసియల్‌తో ప్రత్యేక చికిత్స అందుబాటులో ఉందన్నారు. ఈ చికిత్స వల్ల స్కిన్ మోయిస్చురైజడ్ మరియు హైడేటెడ్‌గా ఉంటుందన్నారు. స్కిన్ బ్రైట్‌గా, తెల్లగా వస్తుందన్నారు. దీన్ని రొటీన్‌గా 3-4వారాలు ఒక్కసారి చేయించుకోవాలి. రసాయనాల పీల్స్ ముఖాన్ని ప్రకాశవంతం, కాంతివంతంగా చేస్తాయని తెలిపారు. మొటిమలు తగ్గుతాయి. కళ్లకింద నలుపును తగ్గిస్తుందన్నారు. దీన్ని 3-4వారాలకు ఒక్కసారి చేయించు కోవాలని తెలిపారు.



మెడిఫేషియల్ అనే విధానంగా శరీరంలో తక్షమే గ్లో వస్తుందని తెలిపారు. క్లీనసింగ్, ఎక్స్‌ఫోలేషన్, కాన్డిటైటర్, హైడ్రేట్ అనే నాలుగు స్టెపుల ద్వారా ముఖానికి తక్షమే గ్లో తెపించవచ్చునని డాక్టర్ సునీల్ తెలిపారు. ఈ చికిత్సను నెలకొకసారి చేయించుకోవచ్చునని తెలిపారు. వైద్యుల సలహా మేరకు పేస్ సోప్స్, పేస్ సిరమ్ మరియు క్రీంలు వినియోగించడం ద్వారా మొహాన్ని సౌందర్య వంతంగా కాపాడుకోవచ్చునని డాక్టర్ సునీల్ కిశోర్ తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న శిద్దారాఘవరావు దంపతులు

ఘనంగా అయ్యప్ప పడిభజన

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర మాజీ శిద్దా రాఘవరావు నివాసంలో అయ్యప్ప పడిభజన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని వారిలో నివాసంలో శిద్దా రాఘవరావు,లక్ష్మీ పద్మావతి దంపతులు, శిద్దా సుధీర్ కుమార్,శతి దంపతులు, మన్యం ఫణి కుమార్, సునీత దంపతుల ఆధ్వర్యంలో పడి భజన నిర్వహించారు. పడిభజనలోఅయ్యప్ప, భవానీ భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి, ఏపీ అగ్రికల్చర్ మిషన్ చైర్మన్ మరిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ సుశీల, గ్రానైట్ వ్యాపారులు మండవ రవి, గుమ్మడి సాయిబాబా, మండవ శ్రీనివాసరావు, బంగారురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, విద్యుత్ ఎఇ పిచ్చయ్య, ఎ.గిరిబాబు, మండవ శ్రీనివాసరావు, మండవ గోపి, కోడూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న కలెక్టర్

వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరానికి చెందిన షేక్ బాషా తనకు ట్రై సైకిల్ ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశాడు. స్పందించిన కలెక్టర్ మీకోసం కార్యక్రమంలో బాషాకు సోమవారం ట్రై సైకిల్ అందజేశారు.ఈ కార్యక్రమంలో వికలాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన పాల్గొన్నారు

గ్రామాల సుస్థిరాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి-పర్చూరు

గ్రామాల సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బందికి స్థానిక ఎంఆర్‌సి సమావేశం హాలులో శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న వనరులను ఉపయోగించుకొని వాటి ద్వారా సుస్థిరతమైన అభివృద్ధి జరిగేలా చూడాలని అన్నారు. గ్రామాల సుస్థిరత అభివృద్ధికి కావలసిన లక్ష్యాలు నిర్ధారణ చేసుకొని దాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఎలా అమలు చేయాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్, విఎఎలు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి-మార్టూరు

మండలంలోని వలపర్ల ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు సోమవారం రూ.30 వేలు విలువైన కంప్యూటర్‌ను బహూకరించారు. పూర్వ విద్యార్థులు గోలి శశి సాయి దీప్తి, గోలి జీవన, మరియు షేక్ నాగూర్ వలి ముగ్గురు కలిసి తమ సొంత నిధులతో పాఠశాల విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లుకు అందజేశారు. పాఠశాల విద్యార్థుల అవసరాలను గుర్తించి కంప్యూటర్‌ను అందజేసిన పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమణ

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-దర్శి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములు వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు శ్రీపొట్టి శ్రీరాములు చేసిన కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

20న దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

నియోజకవర్గంలోని ఐదు మండలాల పాస్టర్ దంపతులకు ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శాసనసభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 20న శుక్రవారం ఉదయం 10 గంటలకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సిసిరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని గొట్టగట్టు పంచాయతీలోని అంతర్గత రహదారులన్నీ సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని సర్పంచి పెరికె సుఖదేవ్ అన్నారు. పంచాయతీలోని వెలుగొండ్రాయునిపల్లెలో సిసీ రోడ్ల నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయన మాట్లాడుతూ పంచాయతీలోని అంతర్గత రహదారుల అభివృద్ధికి మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి రూ.50లక్షల నిధులు మంజూరుకు కృషి చేశారని అన్నారు. ఆయన ఆదేశాల మేరకు సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ నిధులను పంచాయతీలోని వెలుగొండ్రా యినిపల్లి, గొట్లగట్టు, నాయుడుపేట గ్రామాలలోని అంతర్గత రహదారుల నిర్మాణానికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా త్వరలో సబ్ ప్లాన్ నిధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన అన్ని రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ కె సంజీవరావు

రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-తాళ్ళూరు

గ్రామాలలో రెవెన్యూ సదస్సులో రెవెన్యూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ కె సంజీవరావు అన్నారు. మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో ఆ గ్రామ సర్పంచి పోశం సుమలత అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ దరఖాస్తులు పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కూడా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిటి ఇమ్మానియేల్‌రాజు, ఎంపిటిసి గూడా సరస్వతి, పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి, విఆర్ఓ గ్రామస్తులు పాల్గొన్నారు.

నారపుశెట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి-దర్శి

మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి, ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ శాసన సభ్యులు పాపారావు పూలమాలలు వేసి సోమవారం నివాళులు అర్పించారు. మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి శ్రీరాములు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని అన్నారు. స్థానిక గడియారం సెంటర్‌లో జరిగిన నారపుశెట్టి శ్రీరాముల వర్ధంతి సభలో ఆమె మాట్లాడారు. దర్శి శాసనసభ్యులుగా నారపుశెట్టి శ్రీరాములు తమ తాత గొట్టిపాటి హనుమంతరావు నిస్వార్థ సేవకులుగా ఈ ప్రాంతానికి సేవలందించారని గుర్తు చేశారు. అలాంటి నాయకులు భవిష్యత్తులో కూడా ఉండరని అన్నారు. నారపుశెట్టి శ్రీరాములు వారసులుగా ఆయన కుమారుడు నారపుశెట్టి పాపారావు శాసన సభ్యుడిగా ఈ ప్రాంతంలో గుర్తింపు పొందారని, నిస్వార్థ సేవకుడని అన్నారు. దర్శిలో సుస్థిరత స్థానాన్ని సంపాదించుకున్న నారపుశెట్టి కుటుంబం ఎప్పుడు గుర్తుంటారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత సాగర్‌తో పాటు నాయకులు దారం సుబ్బారావు, మారెళ్ళ వెంకటేశ్వర్లు, శాగం కొండారెడ్డి, వీసీరెడ్డిగడ్డం బాలయ్య, శ్రీనివాసరావు, సానే సుబ్బయ్య, దేవతి మహానంద, నాదెండ్ల అంజయ్య, పుల్లలచెరువు చిన్న, కర్ణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పాపారావు

టిడిపి నాయకుడు పాలకొల్లుకు ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి

ప్రజాశక్తి-సిఎస్ పురం

సిఎస్ పురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి(75) మృతదేహానికి కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డి సోమవారం నివాళులు అర్పించారు. ఆయన మరణ వార్త వినగానే హుటాహుటిన సిఎస్ పురం వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వెంకటేశ్వర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయల నారాయణరెడ్డి, పలు టిడిపి నాయకులు నివాళులర్పించారు.

గుండెపోటుతో టిడిపి నాయకుడు మృతి

సిఎస్ పురరం పట్టణానికి చెందిన టిడిపి నాయకులు పాలకొల్లు వెంకటేశ్వర్ రెడ్డి (75) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గతంలో కాంగ్రెస్ పార్టీ, వైసిపి మండల అధ్యక్షులుగా పని చేశారు. ప్రస్తుతం టిడిపిలో కొనసాగు తున్నారు. మండలంలో రాజకీయంగా సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల పలువురు కాంగ్రెస్, వైసిపి, టిడిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.


వెంకటేశ్వరరెడ్డి (75)


నరసమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం

ఆయా నరసమ్మ మృతదేహానికి నివాళి

ప్రజాశక్తి - కొనకనమిట్ల

స్థానిక ఆది ఆంధ్ర పాఠశాలలో గత 10ఏళ్లుగా ఆయాగా పని చేస్తున్న పట్రా నరసమ్మ (55) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలు నరసమ్మ పాఠశాలలో ఆయాగా పని చేసి మంచి గుర్తింపు పొందారు. విద్యార్థులందరూ ఆయా నరసమ్మ అని ఆప్యాయంగా పిలిచేవారు. మృతురాలికి కుమారుడు నాగేష్, కుమార్తె కలరు. మృతురాలికి ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్‌కెజి మస్తాన్, రహీం పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసమ్మ ఆయా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించే వారిని అన్నారు. ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచేదని తెలిపారు. ఆమె చనిపోవడం బాధాకరమని హెచ్‌ఎం గాయం కాశిరెడ్డి, ఉపాధ్యాయులు మస్తాన్, రహీం, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సాయి లక్ష్మి అన్నారు. అనంతరం ఆమె మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును పాఠశాల తరపున ఆమె కుమారుడు పట్రా నాగేష్‌కు అందజేశారు. పాఠశాలలో ఆయా సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నిశనం రూతు, ప్రధానోపాధ్యాయులు గాయం కాశిరెడ్డి, ఎస్‌కెజి మస్తాన్, రహీం, సీనియర్ పాత్రికేయులు పివి కొండయ్య, పి బాలనరసయ్య, పాస్టర్ కోలా రవికుమార్, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, కుకింగ్ నిర్వహకులు పాల్గొన్నారు.

మాదిగ యువకుడి బలవన్మరణం కేసును ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌గా మార్చాలి



డిఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న నీలం నాగేంద్రం

ప్రజాశక్తి-దర్శి

10 నెలల క్రితం పొదిలిలో ఇతర కులాలచే వేధించబడి మాగులూరి రవి అనే మాదిగ యువకుని బలవన్మరణం కేసును ఎస్సీ యాక్ట్‌గా మార్చి చార్జ్‌షీట్ వెయ్యాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర డిమెండ్ చేశారు. మాగులూరి రవి కేసు విషయమై దర్శి డిఎస్పీని కలవాటానికి సోమవారం దర్శికి రాగా దర్శి డిఎస్పీ అందుబాటులో లేకపోవటంతో దళిత నేత నీలం నాగేంద్ర దర్శి డీఎస్పీ లక్ష్మీనా రాయణతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిబ్రవరి 7న పొదిలి టైలర్స్ కాలనీలో మాగులూరు రవి అనే మాదిగ యువకుడు బిసి కులానికి చెందిన ఒక మహిళతో అక్రమ సంబంధ వేధింపులకు మాధవి అనే మహిళ ఇంట్లో ఊరు వేసుకొని బలవన్మరణం చెందాడన్నారు. ఈ ఘటన ఫ్రిబ్రవరి 7న జరుగగా పొదిలి పోలీసులు క్రైమ్ నెం.35/2024 అనుమానస్పద కేసుగా నమోదు చేశారని అన్నారు. ఈ కేసులో ఎలాంటి పురోగతి లేదని, వెంటనే దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దరా అంజయ్య, కాకుమని రవి, గిరిజన నాయుకులు గంట సుబ్బారావు, గర్నెపూడి యోహాను తదితరులు ఉన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.1,23,032

ప్రజాశక్తి - సిఎస్ పురం

మిట్టపాలెం నారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.1,23,032 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. టికెట్లు అమ్మకం ద్వారా రూ.53,450, లడ్డు ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.18820, శాశ్వత అన్నదానంనకు రూ.48,242, మహాప్రాకార నిర్మాణానికి రూ.2520 వచ్చినట్లు తెలిపారు. ఇందులో శాశ్వత అన్నదానంనకు హైదరాబాద్‌కు చెందిన వీరంరెడ్డి రత్నారెడ్డి, లక్ష్మీనారాయణమ్మ రూ.10,116 అందజేశారు. దాతల సహకారంతో నిత్య అన్నదానం నిర్వహణతోపాటు భక్తులకు ఆలయంలో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నట్లు ఇఒ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని తూర్పుగంగవరంలోని ఎరువుల దుకాణాలను ఎఓ పి ప్రసాదరావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడంతోపాటు సరఫరాలో కొరత లేకుండా అవసరమైనవి అందుబాటులో ఉంచడానికి తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఓ నాగరాజు, దుకాణదారులు పాల్గొన్నారు.



గంగవరంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎఓ

హైవే నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

అండర్ పాసుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

రైతుల సమ్మతితోనే పరిహారం అందించాలి

హైవే అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే ఏలూరి



హైవే అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ప్రజలకు మెరుగైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్న హైవే నిర్మాణ అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చేయాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ళ ఒడరేవు హైవే పనులకు సంబంధించి పెండింగ్ వివరాలపై ఆయన ఆరా తీశారు. రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పలు సమస్యలను అధికారులు వివరించి వాటిలో కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రహదారుల నిర్మాణం అభివృద్ధికి చిహ్నాలన్నారు. తిమ్మరాజుపాలెం, కారంచేడు గ్రామాల పరిధిలో హైవే అండర్ డ్రైనేజ్ పటిష్టంగా ఉండాలని రైతులు కోరిన విధంగా మూడు మీటర్ల నుంచి పది మీటర్లకు పెంచాలని అధికారులను ఆదేశించారు. రైతులకు హైవే ప్రాముఖ్యతను వివరించి ఈ ప్రాంత అభివృద్ధికి దోహదం చేసే అంశాలను తెలియజేసి రైతుల సమ్మతితో భూములను తీసుకోవాలని సూచించారు. హైవే పక్కన వరద కాలువ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమస్యలను కలెక్టర్ జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి త్వరతగతిన పరిష్కారం అయ్యేలా చూస్తానని అధికారులకు వివరించారు. ప్రతి గ్రామంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బస్సు షెల్టర్ల నిర్మాణం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కారంచేడు ప్రాంతంలో రైతుల కోరిక మేరకు రెండు మీటర్ల పైప్ లైన్‌ను మూడు మీటర్ల పైపులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. నల్లమడ నుంచి రూమ్ పేరు వరకు డ్రైన్లు లను ఆధునికరిస్తామన్నారు. పెండింగ్లో ఉన్న రైతాంగానికి యుద్ధ ప్రాతిపదికన పరిహారం చెల్లించాలని అధికారులు ఆదేశించారు. టెక్నికల్ సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించేందుకు చొరవ చెప్పాలన్నారు. హైవే అథారిటీ డిఈ, ఈఈ, జేఈ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల సాధనకు కృషి

కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-చెరుకుపల్లి

సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని అన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాల మనుగడ ప్రశ్నార్థకంగా ఉన్న ప్రస్తుత పరిస్థితులలో ప్రస్తుత ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తు తరాల వారికి వనరులను మిగిలేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులపాటు మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల వారికి శిక్షణ తరగతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. 2030 సంవత్సరం నాటికి ఐక్య రాజ్యసమితి మరియు భారత ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి మరియు లక్ష్యాల సాధనకు ఇటువంటి శిక్షణ తరగతులు దోహదం చేస్తాయని అన్నారు. ఈ సందర్భంగా నిర్దేశించిన పది లక్ష్యల సాధన కొరకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ సభ్యులు జి.కేజియా, లింక్ ఆఫీసర్, డివిపిఓ జి.నరసింహారావు, ఈవోపీఆర్ అండ్ఆర్డీ శ్రీనివాసన్, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు: నేటి నుంచి స్థానిక భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల సాధనలో భాగంగా రెండో బ్యాచ్‌కి సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ డి.వి.లలిత కుమారి, జడ్పిటిసి టి.ఉదయభాస్కరి, ఎంపీడీవో ఎస్.వెంకట రమణ, విస్తరణాధికారి టి.ఉమారాణి, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు. ఎంపీపీ డి.వి.లలిత కుమారి మాట్లాడుతూ ఉద్యోగ భావనతో కాకుండా సేవాభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వీఆర్వోలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, ఫిషరీస్ మరియు ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంగులూరు: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించేందుకు అధికారులు కృషి చేయాలని పంగులూరు ఎంపీడీవో కె.స్వరూప రాణి అన్నారు. మండలంలోని అధికారులకు ఎస్‌డిజి పై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు మొదటి రోజైన సోమవారం పంగులూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డి కె.సుమంత్ మండల అధ్యక్షురాలు తెల్ల నాగమ్మ, సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ, ఏపిఎం జ్యోతి ప్రసాద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జయప్రద, పద్మజ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు: మద్దిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో తమ తమ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణా, ఈవోపీఆర్డి కె.రఘుబాబు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసులు, ఎనర్జీ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం: మండల పరిషత్ ప్రాంగణంలోని ఐసిడిఎస్ సమావేశం హాలులో కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడి కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ఐక్యరాజ్య సమితి 9 లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. లక్ష్యాలు అమలు చేయడానికి లక్ష్యసాధనకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం, పివోఆర్‌డి శ్రీనివాసరావు, ఏవో ఎంఎఎస్ శర్మ పాల్గొన్నారు.

కొత్తపట్నం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థిరాభివృద్ధి, లక్ష్యసాధనకు నాలుగు రోజులు పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డి మూర్తి మాట్లాడుతూ అందరికీ ఉపాధి కల్పన, పరిశ్రమల స్థాపన, స్థానిక వనరులు సద్వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, వివిఎలు పాల్గొన్నారు.

కామ్రేడ్ శ్రీకృష్ణకు సిపిఎం ఘన నివాళి



కామ్రేడ్ శ్రీకృష్ణకు నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-కొండెపి

కొండెపి మండలం ముప్పవరం గ్రామానికి చెందిన కామ్రేడ్ బొడ్డపాటి శ్రీకృష్ణ(74) సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ కొండెపి మండలం ముప్పవరం గ్రామానికి చెందిన కామ్రేడ్ బొడ్డపాటి శ్రీకృష్ణ 1964లో కమ్యూనిస్టు పార్టీకి సానుభూతి పరుడుగా రైతు, వ్యవసాయ కార్మికుల పక్షాన నిలబడి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. పేదల పక్షాన ఉంటూ రాజీలేని పోరాటాలు చేశాడన్నారు. నిరంతరం పేద రైతులు వ్యవసాయ కార్మిక సమస్యలు గుర్తించి స్థానిక అధికారులకు అర్జీ రూపంలో ఇస్తూ ప్రజల సమీకరించి పోరాటాలు చేసేవాడని ఆయన అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ శ్రీకృష్ణ భూ సమస్య తీసుకొని పట్టు వదలని విక్రమార్కుడిలా నిరంతరం పోరాడాడని గుర్తు చేశారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల పెద్ద పేతురు, అంగలకుర్తి చిన్న బ్రహ్మయ్య, ముప్పరాజు చినబ్రహ్మయ్య, గడ్డం వందనం, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు అంగలకుర్తి సూరిబాబు, ముప్పవరం గ్రామ శాఖ కార్యదర్శి లెక్కిపోగు సుధాకర్, ఆదామ్, గడ్డం పిచ్చయ్య, తలారి దావీదు, తలారి ఏలియా, పాలేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కారంచేడు: కారంచేడు గ్రామంలోని శిథిలావస్థకు చేరిన మంచినీటి ట్యాంకు మరమ్మతులకు సంబంధించిన పనులు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో రెండు చెరువుల మధ్య ఉన్న మంచినీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లగా ఎమ్మెల్యే స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో నేతాజీ ఆధ్వర్యంలో అధికారులు, టీడీపీ నేతలు ఈ కార్యక్రమానికి భూమి పూజ చేశారు.

దుకాణాలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-వేటపాలెం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కనకనాగవరపమ్మ దేవస్థానం వద్ద సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో దేవస్థానానికి రూ.12.84 లక్షలు ఆదాయం చేకూరినట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోతిని శ్రీనివాస రావు వెల్లడించారు. గతం కంటే రూ.5.32 లక్షలు అధికంగా ఆదాయం సమకూరినట్లు ఆయన చెప్పారు. ఈ బహిరంగ వేలం పాటలను దేవదాయ శాఖ ఆర్‌వి వేణుగోపాలరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

జాతీయ తైక్వాండోలో పతకాలు

ప్రజాశక్తి-కొండెపి

ఢిల్లీలో జరిగిన 27వ నేషనల్ తైక్వాండో పోటీల్లో కొండెపి విద్యార్థులు రాణించి పతకాలు సాధించారు. టూల్స్ ఇండివిడ్యువల్ విభాగంలో యం.గీతిక (కాంస్యం), పి.శరణ్య (కాంస్యం) సాధించారు. అలాగే గ్రూప్స్ టూల్స్ విభాగంలో ఆర్.హిమజ, కె.దీక్షిత, ఎ.శిరిచందన, ఆర్.చందన, కె.జస్మితలు వెండి పతకాలు సాధించారు. స్పారింగ్ (ఫైటింగ్) విభాగంలో యం.గీతిక (గోల్డు), ఆర్.హిమజ (కాంస్యం), కె.దిక్షిత (కాంస్యం), పి.శరణ్య (వెండి), ఎస్‌కె యాస్మిన (గోల్డు), కె.జస్మిత (వెండి), వి.విజయ (గోల్డు), ఆర్.జ్యోత్స్న (వెండి), ఆర్.భార్గవ్ (వెండి), ఎ.శిరిచందన (వెండి), ఆర్.చందన (వెండి) పతకాలు సాధించారని జాతీయ తైక్వాండో 8వ డాన్ మాస్టర్ మారుతి ప్రసాదు, కట్టావారిపాలెం మన ఊరి వికాసం ఫౌండర్, ఎన్ఆర్ఐ, జాతీయ తైక్వాండో 4వ డాన్ దర్మవరపు ప్రసాదు తెలిపారు. ఈ సందర్భంగా మారుతి ప్రసాదు, దర్మవరపు ప్రసాదు మాట్లాడుతూ నేషనల్ తైక్వాండోలో బాలికలు అద్భుతంగా రాణించారని తెలిపారు. జూన్‌లో నేపాల్‌లో జరగపోయే పోటీలలో కూడా విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా మన ఊరి వికాసం సభ్యులు, కొండెపి ప్రజలు విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-వేటపాలెం

కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొత్తపేటలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి గుండె, కిడ్నీ , పేషంట్లకు తగిన జాగ్రత్తలు చెప్పారు. ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈ క్యాంపులో డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాలజిస్ట్ రాణి, కిమ్స్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చీరాల

చీరాల ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకింగ్ సభ్యులు డాక్టర్ ఇస్తర్ల బాబూరావు, సుభాషిణి ఆర్థిక సాయంతో హైస్కూల్ ప్రాంగణంలో మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ళ గురుప్రసాద్, గొడవర్తి సుధాకరరావు, వలివేటి మురళీకృష్ణ, దేవకి, సుబ్బారావు, నారాయణమూర్తి, వీరాంజనేయులు, తిరుపతిరావు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, రమేష్, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-కొండెపి

వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఐటిసి అధికారులు తెలిపారు. సోమవారం కొండెపి మండలం కె.ఉప్పలపాడు గ్రామంలో ఐటీసీ ఎంఎస్‌కె - సెర్ప్ ఎన్జీవో, మరియు ఐటిసి ఏబిడి డివిజన్ సమిష్టి సహకారంతో మియావాకి పద్ధతిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సెంట్ల స్థలంలో మొత్తం 525 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండపనేని అచ్యుత్ కుమార్, డాకా పిచ్చిరెడ్డి, మల్లికార్జున్, సెర్ప్ సంస్థ నుంచి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చరణ్ కుమార్ రెడ్డి, నాగరాజు, ధనంజయ, ఇతర ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసి ప్రఖర్ జైన్

అర్జీలను పరిష్కరించాలి : జేసీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సమస్యలపై ప్రజల నుంచి వస్తున్న అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. ప్రజా స్థానిక కలెక్టరేట్‌లో సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 98 దరఖాస్తులు వచ్చాయి. అనంతరం జేసీ తహశీల్దార్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లోఉన్న పిజిఆర్‌ఎస్, రెవెన్యూ మరియు రీ సర్వే దరఖాస్తుల గురించి ఆరా తీశారు. పిజిఆర్‌ఎస్ పై వచ్చిన ఫిర్యాదులకు సరైన కారణాలు చూపకుండా అసంపూర్తిగా తిరస్కరించడం సరికాదన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పెండింగ్ ఉన్న అర్జీలను కేటగిరీల వారీగా విభజించి నివేదించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన తీరుపై జేసీ ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని పలు సూచనలు చేశారు. గడువు దాటే వరకూ అర్జీలను పెండింగ్‌లో ఉండరాదన్నారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులను నాణ్యతతో పరిష్క రించడానికి సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక దష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' లక్ష్యాలు పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టం కింద కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనులపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో పాటు కూలీలకు సరాసరి వేతనం ఎక్కువగా వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులతో కలసి గహ నిర్మాణాల పురోగతి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య ఏర్పాట్లు, ఎంఎస్‌ఎంఇ సంబంధించిన సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు, స్కూల్ టాయిలెట్స్ పరిశీలన మిస్సింగ్ సిటిజన్స్ మ్యాపింగ్, హౌస్ ఇమేజ్-జియో కోఆర్డినేట్స్, ఎన్‌పిసిఐ లింక్, సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఏపీడీ, ఎపిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిడిఒలు, ఏపీడీలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. వేజ్ సీకర్స్ ని మొబిలైజ్ చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ఫాంపాండ్ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

గృహ నిర్మాణాల లక్ష్యాలపై ప్రత్యేక శ్రద్ధ

పేదల గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చుపాలని కలెక్టర్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో లక్ష గృహాలకు సామూహికంగా ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిఇపారు. జిల్లాలో 3,800 గృహ నిర్మాణాలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకూ 2003 గృహాల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన గృహ నిర్మాణాలను రోజువారీ లక్ష్యాలను నిర్ధేశించుకొని త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిరా ్మణాలకు సంబంధించి వంద శాతం గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీస ుకోవాల న్నారు. గ్రౌండింగ్ అయిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో నమోదు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలరు. వాటర్ ట్యాంక్ల క్లీనింగ్, వాటర్ టెస్టింగ్, క్లోరినేషన్ పై దష్టి సారిం చాలని పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్. అధికారులను ఆదేశించారు. పారిశు ధ్యఏర్పాట్ల పై పంచాయతీ రాజ్ అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు.. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది కచ్చితంగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలను ఆదేశించారు. ఎన్‌పిసిఐ మ్యాపింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఎంఎస ఎంఇ సర్వే త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, జడ్‌పి సిఇఒ బి. చిరంజీవి, డ్వామా పీడీ కె. జోసఫ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి జి.వెంకట నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ బాల శంకరరావు, పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాస రావు, మెప్మా పీడీ టి.రవి కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారిడి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఒకేషనల్ కళాశాలల' ప్రెసిడెంట్‌గా విజయరత్నం

ప్రజాశక్తి-టంగుటూరు

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకేషనల్ కళాశాలల కమిటీ ప్రెసిడెంట్‌గా టంగుటూరులోని శ్రీనిధి ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ వాయల విజయరత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రకేసరి నగర్‌లోని జెకె ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రయివేటు ఒకేషనల్ కళాశాల యాజమాన్య సదస్సు సోమవారం నిర్వహించారు. సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా వాయల విజయరత్నం, వైస్ ప్రెసిడెంట్‌గా సూర్య రమేష్, కార్యదర్శిగా డాక్టర్ నవీన్, జిల్లా సెక్రటరీగా ఏ.క్రిష్టాఫర్, ట్రెజరర్‌గా రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవరపల్లి శాంతి కుమార్, కార్య నిర్వాహక సభ్యులు బాలరాజు, శ్రీనివాసరావు జిల్లా అధ్యక్షుడు వాయల విజయరత్నంను పూలమాలలతో సత్కరించారు.



విజయరత్నంను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు



నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులతో మాట్లాడుతున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

నేడు నీటి పంపిణీ సంఘాలకు ఎన్నికలు

ఏకగ్రీవాల కోసం అధికార పార్టీ నేతల కసరత్తు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టా, నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టు పరిధిలోని నీటి పంపిణీ సంఘాలకు మంగళవారం ఎన్నికలు జరుగనున్నాయి. గత శనివారం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. అన్ని సాగునీటి సంఘాలను టిడిపి మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో వైసిపి పోటీ చేయలేదు. దీంతో ఎన్నికలు ఏకపక్షమయ్యాయి. అదేవిధంగా కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో 22 నీటి పంపిణీ సంఘాలకు ఎన్నిక జరుగనుంది. జిల్లాలో 92 సాగునీటి సంఘాలకు అధ్యక్షులుగా ఎన్నికైన వారు నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష,ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. సాగర్ కాలువ పరిధిలో సాగునీటి సంఘ అధ్యక్షులుగా ఎన్నికైన వారు తమ పరిధిలోని ఎనిమిది నీటి పంపిణీ సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో నిర్వహిస్తున్న ఎన్నికలు వేమూరు, కొల్లూరు, నగరం, నిజాంపట్నం, రేపల్లె, అమృత లూరు, చుండూరు, బాపట్ల, కర్లపాలెం, చీరాల,పర్చూరు, సంతమాగులూరు, బల్లికరవ, అద్దంకి, పంగులూరు, కోనంకి,మార్టూరు ఇరిగేషన్ కార్యాలయాల్లో జరుగనున్నాయి. సాగర్ కాలువ పరిధిలోని నీటి పంపిణీ సంఘాలకు సంతమాగులూరు ,కొమ్మాలపాడు, అద్దంకి, కోనంకి, పర్చూరు డిఇకార్యాలంలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహిస్తారు. సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికయిన వారు నీటి పంపిణీ సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేస్తారు. అనంతరం ఎన్నిక నిర్వహిస్తారు. ఏకగ్రీవం కాక పోతే బ్యాలెట్ పద్ధతితో ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికారులను నియమించారు. ఎన్నికల అనంతరం మరో రోజు జిల్లా ప్రాజెక్టు కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదిదారులు తమ సమస్యలను స్వయంగా ఎస్‌సికి విన్నవించుకున్నారు. ఎస్‌పి ఫిర్యాదిదారులు సమస్యలు క్షుణంగా విన్నారు. అర్జీలను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌ద్వారా మాట్లాడారు. ఫిర్యాదులపై చట్ట ప్రకారం విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించి భాదితులకు న్యాయం చేయాలని ఎస్‌పి ఆదేశించారు. వివిధ సమస్యల పరిష్కరం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాద ుదారులతో పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి చట్ట పరిధిలో వారి సమస్యల పరిష్కారానికి కషి చేయాలన్నారు. పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తామని ఎస్‌పి ఫిర్యాది దారులకు భరోసా ఇచ్చారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 37 మంది అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి టిపి.విఠలేశ్వర్, పిజిఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి సిఐ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్‌పి